జానపద సంగీతంలో రాష్ట్ర స్థాయికి ఎంపిక



బొంరాస్‌పేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సివిల్ సర్వీస్ సంగీత నృత్య, నాటిక పోటీల్లో భాగంగా జానపద సంగీతంలో బొంరాస్‌పేట్ మండలం నాందర్‌పూర్ పంచాయతీ కార్యదర్శి శోభారాణి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో ఆమె వచ్చే నెల ఢిల్లీలో జాతీయ స్థాయిలో జరగనున్న పోటీల్లో పాల్గొననుంది.



నందివాగు ప్రాజెక్టులో చేప పిల్లలు వదులుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కాస్లాబాద్ శివారులోని నందివాగు ప్రాజెక్టులో మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ముదిరాజ్‌లకు జీవనోపాధి కల్పించేందుకు ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26వేల చిన్న, పెద్ద చెరువుల్లో నాణ్యమైన చేప పిల్లలను విడతల వారీగా వదులుతున్నామని తెలిపారు. జిల్లాలోని కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధి కోసం రూ.90 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. టెండర్ పూర్తయిందని, పనులు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం మోమిన్‌పేట్ మండల కేంద్రంలో 48 మంది లబ్ధిదారులకు రూ.48,5,568 విలువ గల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం దేవరంపల్లి గ్రామంలో రూ.47 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన, చక్రంపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం, సీసీ రోడ్లను ప్రారంభించారు. దేవరంపల్లి, చక్రంపల్లి గ్రామాల్లో దాదాపు రూ.300 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ మహిళా మత్స్యకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కార్యక్రమంలో మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, శంకర్ యాదవ్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి సదానందం, బీసీ సంక్షేమ అధికారి మాధవరెడ్డి, మండల మత్స్య సహకార సంఘం చైర్మన్ రాజు, నాయకులు నరోత్తంరెడ్డి, సుభాష్ గౌడ్, సురేందర్, మానెయ్య, చంద్రయ్య, మల్లారెడ్డి, నర్సిములు, సిరాజుద్దీన్, సుభాష్ తదతరులు పాల్గొన్నారు.

ఈఈగా విధుల్లోకి సత్యనారాయణరెడ్డి

కలెక్టర్ అటాచ్ చేసిన 12 రోజులకే రీపోస్టింగ్

తాండూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాండూరు పంచాయతీరాజ్ ఈఈగా సత్యనారాయణరెడ్డి మంగళవారం తిరిగి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన ఆయనను విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని స్వయంగా కలెక్టర్.. పంచాయతీరాజ్ శాఖకు సరెండర్ చేస్తూ 13న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇది జరిగిన 12 రోజులకే మళ్లీ ఈఈగా రిపోస్టింగ్ పొందడం గమనార్హం. అయితే తాను కొద్ది రోజుల పాటు సెలవుపై వెళ్లినట్లు సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల తాను సెలవులో నుంచి తిరిగి బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.





విడతల వారీగా మండలాలు

మొదటి విడత: తాండూరు, బషీరాబాద్, యాలాల్, పెద్దేముల్, కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, దుద్యాల్

రెండో విడత: వికారాబాద్, ధారూరు, మోమిన్‌పేట్, నవాబుపేట్, బంట్వారం, మర్పల్లి, కోట్‌పల్లి

మూడో విడత: పరిగి, పూడూరు, కులకచర్ల, చౌడాపూర్, దోమ

సమరమే

మోగిన పంచాయతీ నగారా

- మూడు విడతల్లో ఎన్నికలు
- సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం
- 594 పంచాయతీలు.. 5,058 వార్డులు
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- పల్లెల్లో రాజుకున్న రాజకీయ వేడి

గ్రామీణ ఓటర్ల వివరాలు	
మొత్తం	6,98,472
పురుషులు	3,43,668
ఇతరులు	16
మహిళలు	3,54,788

పంచాయతీ ఎన్నికలకు నగారా మోగింది. దీంతో పంచాయతీల్లో ఒక్కసారిగా రాజకీయ వేడి రాజుకుంది. జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మంగళవారం షెడ్యూల్‌ను ప్రకటించారు. మొదటి విడతలో తాండూరు డివిజన్‌లో కొడంగల్, తాండూరు నియోజకవర్గాల పరిధిలో, రెండో విడత వికారాబాద్ నియోజకవర్గంతో పాటు నవాబుపేట మండలం, మూడో విడతలో పరిగి నియోజకవర్గ పరిధిలోని పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. 25వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి డిసెంబరులో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అమలులో ఉండనుంది.

విడతల వారీగా పోలింగ్ జరిగే పంచాయతీల వివరాలు

	తొలి విడత	రెండో విడత	మూడో విడత
నోటిఫికేషన్	నవంబరు 27	నవంబరు 30	డిసెంబరు 3
పోలింగ్	డిసెంబరు 11	డిసెంబరు 14	డిసెంబరు 17
నియోజకవర్గాలు	తాండూరు, కొడంగల్	వికారాబాద్, నవాబుపేట్ మండలం	పరిగి
మండలాలు	8	7	5
పంచాయతీలు	262	175	157
వార్డులు	2,198	1,520	1,340
పోలింగ్ కేంద్రాలు	2,198	1,520	1,340

వికారాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మొదటి విడత ఎన్నికలకు సంబంధించి ఈనెల 27వ తేదీన రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి ఆ రోజు నుంచి 29వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 30న నామినేషన్లు పరిశీలించి అర్హులైన అభ్యర్థుల జాబితా సాయంత్రం 5 గంటల తరువాత ప్రకటిస్తారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే డిసెంబరు ఒకటో తేదీ సాయంత్రం 5 గంటలలోగా తెలియజేస్తే 2వ తేదీ, సాయంత్రం 5 గంటలలోగా వాటిని పరిష్కరిస్తారు. 3వ తేదీ, సాయంత్రం 3 గంటల్లోగా నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. అదే రోజు సాయంత్రం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, వారికి కేటాయించిన గుర్తులను ప్రకటిస్తారు. 11వ తేదీన ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు

మిగతా 8వ పేజీలో...


ఔటర్ దాటిన.. గ్రేటర్

విలీనం కానున్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు

విస్తరణకు రాష్ట్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్.. స్థానిక రాజకీయ నాయకుల ఆశలు ఆవిరి

మేడ్చల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అంతా ఊహించినట్లుగానే జీహెచ్‌ఎంసీ విస్తరణలో భాగంగా నగర శివారు మున్సిపాలిటీలు జీహెచ్‌ఎంసీలో కలిపేందుకు ముందడుగు పడింది. ఔటర్ రింగు రోడ్డు లోపల, బయట, ఓఆర్‌ఆర్‌ను ఆనుకుని ఉన్న 27 మున్సిపాలిటీ, కార్పొరేషన్లు జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జీహెచ్‌ఎంసీ పరిధి ప్రస్తుతం 650 చదరపు కిలోమీటర్లు ఉండగా.. ఔటర్ పరిధితో పాటు అవతల గల మేడ్చల్, ఘట్‌కేసార్ ప్రాంతాలకు జీహెచ్‌ఎంసీ విస్తరణతో 2వేల చదరపు కిలోమీటర్లకు పైగా పెరగనుంది. దీంతో జీహెచ్‌ఎంసీ సేవలు మున్ముందు ఔటర్ అవతలి వరకు గల ప్రాంతాల వరకు అందనున్నాయి. 27 మున్సిపాలిటీల్లో అధికం ఆదాయం వచ్చే ప్రాంతాలుగా నార్సింగి, మణికొండ, తెల్లాపూర్, అమీన్‌పూర్, బండ్లగూడ జాగీర్, నిజాంపేట, బడంగ్‌పేట తదితర ఉన్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా నిర్మాణ అనుమతులిచ్చే కార్పొరేషన్లలో జీహెచ్‌ఎంసీ తర్వాత బడంగ్‌పేట ఔటర్ పరిధిలోని ఇతర కార్పొరేషన్లున్నాయి. ఇక ముందు జీహెచ్‌ఎంసీలో

మిగతా 7వ పేజీలో...



విలీనమయ్యే మున్సిపాలిటీలు

రంగారెడ్డి జిల్లాలోని పెద్దఅంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, తుక్కుగూడ, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట.. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పరిధిలోని మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, కొంపల్లి, దుండిగల్, బొల్లారం.. సంగారెడ్డి జిల్లాలోని తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాల్టీలతో పాటు మేడ్చల్ జిల్లాలోని నాలుగు కార్పొరేషన్లు.. బోడుప్పల్, నిజాంపేట్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్‌లు సైతం జీహెచ్‌ఎంసీలో విలీనం కానున్నాయి.

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



వికారాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహిళల ఆర్థిక అభివృద్ధి సంక్షేమం కోసం స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం జిల్లాలో 9,232 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.7.38 కోట్లు, జూలై 2025 వరకు వడ్డీలేని రుణాలు సీఎం చేతుల మీదుగా విడుదల చేయగా ఈ రోజు స్వయం సహాయక సంఘాల మహిళల ఖాతాలలో జమ చేసినట్లు తెలిపారు. పరిగి 2,781 సంఘాలకు రూ.2.23 కోట్లు, కొడంగల్ 1,101 సంఘాలకు రూ.84 లక్షలు, తాండూరు 2,113 సంఘాలకు రూ.1.77 కోట్లు, వికారాబాద్ 2,664 సంఘాలకు 2.20కోట్ల చొప్పున వడ్డీలేని రుణాలు వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



డ్వాక్రా సంఘాల మహిళలకు చెక్కు అందజేస్తున్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

డ్వాక్రా మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

శామీర్‌పేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోటి మంది డ్వాక్రా సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలను అందజేసి వారిని కోటీశ్వరులుగా చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తాలోని శుభం ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, కలెక్టర్ మనుచౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలోని 3,120 డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.3.22 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ మహిళలు విద్యావంతులైతేనే వారి పిల్లలను అన్నిరంగాల్లో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతారన్నారు. అందుకోసం ప్రజా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేస్తోందని ఆయన వివరించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక వ్యవహారాలలో కూడా మహిళలు ముందుకు రావాలన్నారు. మహిళలు నిరంతరం సైనికులుగా కష్టపడి పని చేస్తున్నారని పొగిడారు. కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్ద పీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్లు, ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, నర్సింలు యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ముజీబుద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ స్నేహ మెహ్రా

విధుల్లో అలసత్వం వద్దు

- వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా

వికారాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫైల్స్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే ఊరుకునేది లేదని ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో వివిధ విభాగాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అడ్మినిస్ట్రేషన్, డీసీఆర్బీ, స్పెషల్ బ్రాంచ్, సైబర్ క్రైమ్ తదితర విభాగాలను పరిశీలించి, అక్కడ నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేశారు. అలాగే సిబ్బందితో అధికారులు ముఖాముఖిగా మాట్లాడి వారి బాధ్యతలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, శాఖ పరమైన సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పని చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ పనులను వేగవంతం చేయాలని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు.

కీసరగుట్ట హుండీ ఆదాయం రూ.1.26కోట్లు

- లెక్కింపు బహిష్కరించిన ట్రస్ట్ బోర్డు సభ్యులు
- ఆలయ చైర్మన్, ఈవోలపై ఆరోపణలు

కీసర, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ కార్తీక మాసోత్సవ ఆదాయం రూ.1,26,93,713 వచ్చినట్లు ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ తెలిపారు. మంగళవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మహ మండపంలో హుండీ ఆదాయం లెక్కించారు. వచ్చిన ఆదాయాన్ని కీసర ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఆలయ ఖాతాలో జమ చేశారు.

ఆలయంలో అంతా అవినీతే..

ఆలయ పరిధిలో భారీగా అవినీతే జరుగుతుందని ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆరోపించారు. మంగళవారం హుండీ లెక్కింపు జరుగుతుండగా ఆలయ చైర్మన్.. అమర్యాదగా మాట్లాడరని ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయంలో జరుగుతున్న అభిషేకాలు టికెట్ లేకుండా జరుగుతున్నాయన్నారు. ఇటీవల దీపారాధన సామగ్రి విక్రయించే కాంట్రాక్టర్‌తో చైర్మన్, ఈవో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని అధిక ధరలకు వస్తువులు విక్రయించారని ఆరోపించారు. అదే విధంగా ఫౌండర్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు వచ్చిన సమయంలో గంటల తరబడి స్వామి వారికి అభిషేకాలు చేయిస్తూ సామాన్య భక్తులను ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే విరాళాలు అక్రమంగా దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. అర్చకుల దోరణి కూడా సరిగ్గా లేదని, కేవలం దక్షిణపై ఉన్న శ్రద్ధ పూజలపై ఉండటం లేదన్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



హుండీ సొమ్మును లెక్కిస్తున్న భక్తులు

కక్ష సాధింపుతోనే ఆరోపణలు: ఈవో

దీనిపై ఆలయ చైర్మన్ తటాకం నారాయణను వివరణ కోరగా కొంత మంది ట్రస్ట్ బోర్డు సభ్యులు వారి వ్యక్తిగతంగా కీసరగుట్టపై ఉద్యోగాలు ఇప్పించాలని కోరారని అన్నారు. అలాగే ఒక ట్రస్ట్ బోర్డు సభ్యుడి కారు క్షేత్రంపైకి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీనికి ఈవో సుధాకర్‌రెడ్డి పోలీసులకు చెప్పాలని కోరారు. దీనిపై స్పందించకపోవడంతో సభ్యులు తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఈ ఆరోపణలతో కీసరగుట్ట పేరు, ఖ్యాతి, ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఆరోపణలు సభ్యులు అవినీతి రుజువు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రేమ విఫలం.. టెకీ ఆత్మహత్య | 6 | ఒకే కుటుంబానికి మూడు పదవులు?

ప్రేమ విఫలం.. టెకీ ఆత్మహత్య


కళ్యాణ్‌రెడ్డి (ఫైల్)

ఘట్‌కేసర్‌రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమైందని మనస్తాపంతో ఐటీ ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా, సంగడిగుంటకు చెందిన కుర్ర శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు కుర్ర పవన్ కళ్యాణ్‌రెడ్డి (26)సింగపూర్ టౌన్‌షిప్‌లో స్నేహితులతో కలిసి అద్దెకుంటూ ఇన్ఫోసిస్‌లో ఐటీ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల పవన్ కళ్యాణ్‌రెడ్డి ప్రేమవిఫలం కావడంతోమనస్తాపానికి గురై సోమవారం రాత్రి గదిలో బెడ్‌షీట్‌తో ఉరివేసుకున్నాడు. గమనించిన స్నేహితులు మృతుడి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మంగళవారం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. తన కుమారుడి మృతికి ప్రేమవిఫలమే కారణమని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

● ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇతోధికంగా నిధులిస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మంగళవారం యాచారం, నందివనపర్తి, కొత్తపల్లి, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లో రూ.7.7కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో సర్పంచ్ పదవులను ఏకగ్రీవం చేసుకున్న గ్రామానికి అభివృద్ధికి రూ.కోటి ఇప్పిస్తానని వెల్లడించారు. ప్రతి గ్రామంలో యూజీడీ, సీసీ రోడ్లు, స్ట్రీట్‌లైట్లు వేయిస్తామని, పాఠశాలలకు అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటుతో యువతకు ఉపాధి కల్పించేలా సీఎం రేవంత్‌రెడ్డి శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వసంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధిని ఓర్వని కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఇది పద్ధతి కాదన్నారు. త్వరలో మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం వరకు రోడ్డు విస్తరణ పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమాల్లో మస్కు నర్సింహ, ఏఎంసీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి, అక్బర్, కె.శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క పంచాయతీ దక్కలే..!

● ఆమనగల్లు మండలంలో బీసీలకు నిరాశే
● ఆందోళనకు సిద్ధమవుతున్న బీసీ సంఘాల నేతలు


ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం

ఆమనగల్లు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మండలంలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు బీసీలకు తీవ్ర నిరాశ కలిగించాయి. 13 గ్రామ పంచాయతీలకు గాను ఒక్క పంచాయతీ కూడా బీసీలకు కేటాయించలేదు. దాంతో బీసీ సంఘాల నేతలు, సామాజిక వర్గాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆమనగల్లు మడంలంలో 13 గ్రామ పంచాయతీలకుగాను 6 జనరల్, 4 ఎస్టీలకు, 3 ఎస్సీలకు, అందులో ఆరు మహిళలకు కేటాయించారు. గ్రామ పంచాయతీల వారీగా ఆకుతోటపల్లి జనరల్, చెన్నంపల్లి జనరల్ మహిళ, చింతలపల్లి ఎస్సీ జనరల్, కోనాపూర్ ఎస్టీ మహిళ, కొత్తకుంట తండా జనరల్, మంగళపల్లి ఎస్టీ మహిళ, మేడిగడ్డ జనరల్ మహిళ, పోలెపల్లి ఎస్సీ జనరల్, రామ్‌నుంతల ఎస్టీ జనరల్, సీతారాంనగర్ తండా జనరల్ మహిళ, సంగంపల్లి జనరల్ మహిళ, శెట్టిపల్లి ఎస్సీ మహిళ, శంకర్‌కొండ తండా ఎస్టీ జనరల్‌గా కేటాయించారు. బీసీలు అధికంగా ఉన్న మండలంలో ఒక్క స్థానం కూడా ఆ సామాజిక వర్గానికి కేటాయించలేదు. దాంతో తమకు అవకాశం లభిస్తుందని.. సర్పంచ్‌గా పోటీ చేయాలని భావించిన ఆశావహులకు నిరాశే మిగిలింది. ఏ ప్రాతిపదికన రిజర్వేషన్లు ఖరారు చేశారని బీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 13 పంచాయతీలకు ఒక్క స్థానం కూడా కేటాయించకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్‌లు కల్పిస్తామని ప్రభుత్వం ఆశచూపి తీరా మోసం చేసిందని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. రిజర్వేషన్ల మూలంగా పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం లేకుండా పోయిందని బీసీ నాయకులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

ఒకే కుటుంబంలో మూడు పదవులు?

● మంతన్‌గౌడ్‌లో ఒకే ఒక్క ఎస్టీ కుటుంబం
● సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదవులు దక్కే అవకాశం



బషీరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఈ నేపథ్యంలో ఆగ్రామ పంచాయతీలో ఒకే కుటుంబానికి సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదువులు వరించనున్నట్లు తెలుస్తోంది. ఈ పంచాయతీ ఎస్టీ జనరల్‌కు రిజర్వు కాగా, ఆ సామాజిక వర్గానికి చెందిన ఒకే కుటుంబం ఒక్క కుటుంబం ఇక్కడ ఉంది. ఆ ఇంట్లోంచి సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవం అయ్యే అవకాశం కనిపిస్తోంది. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం మంతన్‌గౌడ్ గ్రామపంచాయతీలో 8వార్డులు ఉండగా, 449మంది ఓటర్లు ఉన్నారు. ఈ క్రమంలో సర్పంచ్ పదవి ఎస్టీ జనరల్‌కు రిజర్వయింది. గ్రామంలో ఎస్టీ సామాజికవర్గం లేకపోగా, ఆ ఊరిలో ఒకే ఒక ఎరుకల కుటుంబం ఉంది. ఆ కుటుంబం ఎస్టీ కిందకు రాగా ఆరుగురు ఓటర్లు ఉన్నారు. అందులో తల్లిదండ్రులు ఎరుకల భీమప్ప, వెంకటమ్మలతో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కొడళ్లు వారి సంతానం ఉంది. ఈ పంచాయతీ ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో ఎరుకల భీమప్ప కుటుంబంలోంచి మాత్రమే సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదవులకు పోటీపడాలి. లేదా ఆ కుటుంబం నుంచి సర్పంచ్, రెండు వార్డుల పదవులను ఏకగ్రీవం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఆ కుటుంబానికి సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదవులు కలిసి రావడంతో గ్రామపంచాయతీలో ఈవిషయం హాట్‌టాపిక్‌గా మారింది. ఇదిలా ఉండగా మండలంలోని దామర్‌చెడ్, గంగ్వార్ గ్రామపంచాయతీల్లో ఎస్సీ కుటుంబాలు ఉన్నప్పటికీ ఒక్క ఎస్సీ వార్డుకు కూడా రిజర్వేషన్లు దక్కలేదు. దీంతో ఆయా గ్రామాల్లో వార్డుసభ్యుల పదవులు దక్కే అవకాశాలు లేకపోవడంతో ఎస్సీ కుటుంబాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మాట్లాడుతున్న ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్

'ఉర్సు'ను శాంతియుతంగా జరుపుకోవాలి

కొత్తూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జేపీ దర్గా ఉర్సు ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని శంషాబాద్ జోన్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో గల హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా ఆవరణలో ఇన్‌స్పెక్టర్ జి.నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతి సమావేశానికి ఏసీపీ హాజరై మాట్లాడారు. వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించే జేపీ దర్గా ఉర్సు ఉత్సవాలను హిందూ, ముస్లింలు కలిసి మెలిసి నిర్వహించుకోవాలన్నారు. ఎస్‌ఐ గోపాలకృష్ణ, ఆగీర్ రవికుమార్ గుప్తా, రాజేష్‌నాయక్, రవికుమార్‌ముదిరాజ్, రవినాయక్, మహ్మద్‌జిలానీపాల్గొన్నారు.

ఘనంగా టీఎస్ఎస్‌వో ఆవిర్భావ వేడుకలు

శంషాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సోషల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్(టీఎస్ఎస్‌వో) ఆవిర్భావ వేడుకలను మంగళవారం శంషాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీ శ్రీనివాస్, అధికార ప్రతినిధి రమేశ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆర్గనైజేషన్ స్థాపించిన కొద్దికాలంలోనే 10 లక్షల మంది సభ్యత్వం పొందారని, విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో విద్యార్థుల పక్షాన పోరాడే సంఘం టీఎస్ఎస్‌వోనేనని అన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ రాష్ట్ర నాయకులు మహేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ ప్రశంసనీయం

కందుకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల ప్రజలకు విస్తృతంగా సేవలందించడం ప్రశంసనీయమని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గడ్డం మహేంద్రకుమార్ రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కందుకూరు, ఆమనగల్లుతో పాటు హైదరాబాద్ బాలాజీనగర్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో లయన్ పీడీజీ జి.చెన్నకిషన్‌రెడ్డి తండ్రి వెంకటరాజిరెడ్డి స్మారక ఉచిత మెగా వైద్యశిబిరాన్ని మంగళవారం తిమ్మాపురంలో నిర్వహించారు. 679 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు చెన్నకిషన్‌రెడ్డి తెలిపారు. జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. లయన్స్ పీడీజీలు ఎ.నటరాజ్, ఎస్.నరేందర్‌రెడ్డి, ఎస్ రాధకృష్ణ, వైఎం ధర్, జిల్లా ఫస్ట్ గవర్నర్ సురేష్ జగ్నాని, డిస్ట్రిక్ట్ సెంకడ్ వైస్ గవర్నర్ డాక్టర్ అంజయ్య, లయన్స్ క్లబ్ ప్రతినిధులు వివిధ ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు.


గ్రామస్తులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

టెక్‌హాక్-4 జాతీయస్థాయి హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరణ



అనురాగ్ యూనివర్సిటీలో టెక్‌హాక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం టెక్‌హాక్-4 జాతీయస్థాయి హ్యాకథాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనురాగ్ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో టెక్‌హాక్-4 జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో భాగస్వాములు కావాలని డీన్ విష్ణుమూర్తి కోరారు. హ్యాకథాన్ వల్ల విద్యార్థులకు సాంకేతిక, వృత్తి నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థుల అభ్యాసం, ఆవిష్కరణలు మెరుగుపడుతాయన్నారు. 36గంటల పాటు జరిగే టెక్‌హాక్-4 హ్యాకథాన్ డిసెంబరు 12, 13తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయస్థాయి కోడింగ్ మారథాన్ వాస్తవ ప్రపంచ సవాళ్లకు వినూత్న పరిష్కారాలు, నమూనాలు, అనువర్తనాలు అభివృద్ధి చేస్తాయని విష్ణుమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోఈ డీన్ విజయకుమార్, అధ్యాపకులు రవీందర్‌రెడ్డి, రాజశేఖర్, బలరామ్, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు తరానా సింగ్, అమిత మిశ్రా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔటర్ దాటిన.. గ్రేటర్

(ఐదో పేజీ తరువాయి)



విలీనమవుతున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నిర్మాణ అనుమతులకు జీహెచ్‌ఎంసీ అనుమతులు ఇవ్వాల్సి ఉంది.

రాజకీయ నాయకుల ఆశలు ఆవిరి

ఓఆర్‌ఆర్ సమీపంలోని రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని పలు మున్సిపాల్టీలు జీహెచ్‌ఎంసీలో విలీనం కానుండటంతో స్థానిక నేతలకు ఒక్కసారిగా రాజకీయ భ్రమలు తొలగిపోయాయి. 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా చైర్మన్లు, మేయర్‌గా పదవులు అనుభవించాలని భావించిన వారికి నిరాశ ఎదురయ్యింది. రాజకీయంగా వారి ఆశలు అడియాశలయ్యాయి. ఇప్పుడిప్పుడే మున్సిపాలిటీల పరిధిలో ఎదుగుతున్న నాయకులు ఆశలపై ప్రభుత్వ నిర్ణయంతో నీళ్లు చల్లినట్లయింది. ఓఆర్‌ఆర్ సమీప మున్సిపాల్టీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయొద్దని కొంతకాలంగా మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్న విషయం తెలిసిందే. జీహెచ్‌ఎంసీలో విలీనమైతే ఎదురయ్యే సమస్యల గురించి వివరించినా ఫలితం లేకుండా పోయింది. కాగా, మేడ్చల్‌లో ఇటీవల కొత్తగా ఏర్పడిన మూడు మున్సిపాల్టీల పరిస్థితి మాత్రం ఎటూ తేలకుండా పోయింది. దీంతో అక్కడి ప్రజల్లో సందిగ్ధత నెలకొంది. జిల్లాలోని 33 గ్రామాలను కలిపి ఇటీవల కొత్తగా ఎల్లంపేట, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. శివారులోని మున్సిపాల్టీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తే జిల్లాలో ఇక మిగిలేది ఈ మూడు బల్దియాలే.. మరి వీటిని మున్సిపాల్టీలుగానే కొనసాగిస్తారా? లేదా? అనే సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి. వీటిని కూడా జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తే జిల్లా పూర్తిగా గ్రేటర్ పరిధిలోకి వెళ్లిపోతుంది.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఇందిరమ్మ ఇంటి ప్లాట్ల కబ్జా!

- తహసీల్దార్‌ను ఆశ్రయించిన గ్రామస్తులు

శంషాబాద్ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని తొండుపల్లిలో ఇందిరమ్మ కాలనీలోని ప్రభుత్వ ప్లాట్లను అక్రమంగా ఆక్రమించిన వారి నుంచి విడిపించాలని తహసీల్దార్‌కు గ్రామస్తులు మంగళవారం ఫిర్యాదు చేశారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి 10వ వార్డు తొండుపల్లి గ్రామంలో ఇందిరమ్మ కాలనీలో 2009లో అప్పటి ప్రభుత్వం లేఅవుట్ చేసి లబ్ధిదారులకు ప్లాట్లను కేటాయించింది. అయితే, ఆ ప్లాట్లు కాకుండా మిగతా 24 ప్లాట్లు ప్రభుత్వ అధీనంలోనే ఉన్నాయి. ఇదే అదనుగా భావించిన కొంత మంది ప్రజాప్రతినిధులు.. వాటిని కబ్జా చేసి రాత్రికిరాత్రే అక్రమ నిర్మాణాలు చేపట్టారని గ్రామస్తులు ఆరోపించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ అంజయ్య, సుధాకర్, శ్రీనివాస్, జయసింహ, అశోక్, రాజు తదితరులు ఉన్నారు.



అంగడిచిట్టెంపల్లిలో మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ సుజాత బృందం

వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి

పూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగ అభివృద్ధికి మండలంలోని అంగడిచిట్టెంపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయం మొక్కజొన్న పరిశోధన విభాగం సంచాలకులు డాక్టర్ సుజాత అన్నారు. మండలంలోని అంగడిచిట్టెంపల్లి గ్రామాన్ని మంగళవారం పరిశోధన విభాగం డాక్టర్ సుజాత బృందం పర్యటించింది. ఈ సందర్భంగా డాక్టర్ సుజాత మాట్లాడుతూ.. వచ్చే మూడు సంవత్సరాలపాటు శాస్త్రవేత్తలు గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలోని పొలాల్లో మట్టినమూనా పరీక్షలు, యాంత్రీకరణ, సాంకేతికపరమైన మెళకువలతోపాటు ఆదాయం పెంచడమే తమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. అనంతరం 12మంది రైతులకు మొక్కజొన్న విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లయ్య, డాక్టర్ శ్రావణి, మండల వ్యవసాయాధికారి తులసీరాం, విస్తీర్ణాధికారి ఎలియాస్, రైతులు రవి, చెన్నయ్య, జంగయ్య, నవాజ్‌రెడ్డి, విఠలయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

- 'నేటి స్త్రీ' పుస్తకావిష్కరణలో ఎమ్మెల్యే మల్లారెడ్డి



నేటి స్త్రీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నేడు మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం పోచారం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ బద్దం మమతా జగన్ మోహన్‌రెడ్డి రచించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోచారం మున్సిపాలిటీ పాలకవర్గంలో ఎంతో చురుకుగా పనిచేసిన మమత పదవి అయిపోగానే ఖాళీగా ఉండకుండా పుస్తక రచన చేపట్టడం అందరికీ ఆదర్శనీయమన్నారు. అందులో నేడు వివిధ రంగాల్లో మహిళలు రాణిస్తున్న తీరు ఎదురవుతున్న సవాళ్ల వంటి అనేక అంశాలతో పుస్తక రచన చేపట్టడం ఎంతో గొప్పవిషయమన్నారు. ఈసందర్భంగా ఆయన రచయిత మమతను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చామకూర కల్పన, సబిత, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోవాలి

మంచాల, నవంబర్ 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి నాయకులకు పిలుపునిచ్చాడు. మంగళవారం మంచాలలో జరిగిన బీజేపీ మండల కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యం చెందిందని విమర్శించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడగడపకూ ప్రచారం చేయాలని సూచించారు. బీజేపీ మండలాధ్యక్షుడు నూకం రాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వింజమూరి వెంకటొరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దన్నె బాషయ్య, మారమోని శ్రీశైలం, పాండాల జంగయ్య, చివిరాల పాండు, వెదిరె జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

వార్డుల వారీగా అనధికార కమిటీలు

సమస్యల పరిష్కారానికి చొరవ .. బల్దియా సిబ్బందికి మొదలైన టెన్షన్



సాయిపూర్‌లో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

తాండూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో అధికార కాంగ్రెస్ పార్టీ కొత్త ప్రయత్నానికి తెరలేపింది. పట్టణంలో ఉన్న 36వార్డుల్లో వార్డుకు ఆరుగురి చొప్పున పార్టీ ముఖ్య నాయకులతో అనధికారిక కోర్ కమిటీలను ఏర్పాటు చేసింది. వారం రోజులుగా పార్టీలో ముఖ్య నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు వార్డుల వారీగా కమిటీలు వేసి మంగళవారం నాటికి కమిటీల ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా వార్డుకు ఒక్క అధికారిని నియమించిన విషయం తెలిసిందే. వార్డుకు ఒక అధికారితో పాటు శానిటేషన్ జవాను, లేబర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయావార్డుల్లో పనిచేస్తుంటారు. వారికి అనుసంధానంగా కోర్ కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతీరోజు వార్డుల్లో వార్డు అధికారితో పాటు కోర్ కమిటీ సమస్యలను గుర్తించి వారానికి ఒకసారి పరిష్కరిస్తారు.

ప్రతీ వారం వార్డు అధికారులతో గ్రామ సభలు

సమస్యలను గుర్తించి వార్డు అధికారులు, కోర్ కమిటీలతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్‌లో సమస్యలను తెలియజేస్తారు. ఈ గ్రూప్‌లో స్థానిక ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ కమిషనర్ కూడా ఉంటారు. ముఖ్యంగా శానిటేషన్ సమస్య, తాగు నీరు, స్ట్రీట్‌లైట్స్, అంగన్ వాడీల పని తీరుపై దృష్టి సారిస్తారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారు. వారం వారం వార్డు అధికారులతో కలిసి గ్రామ సభలు ఏర్పాటుచేస్తారు. ప్రజల నుంచి సమస్యలు విని వెంటనే పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తారు. వార్డు ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా ఇందిరమ్మ, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు అర్హులు ఎవరు? అనే విషయాన్ని కూడా గుర్తిస్తారు.

బల్దియా అధికారుల్లో టెన్షన్

గతంలో అధికారులే వార్డుల్లో సమస్యలు గుర్తించి పరిష్కరించే వారు. ఇప్పుడు వారిపై అనధికారికంగా కోర్‌కమిటీలను ఏర్పాటుచేసి అధికారాలు కట్టబెట్టడంతో బల్దియా అధికారుల్లో టెన్షన్ మొదలైంది. కోర్‌కమిటీల సమస్యలను గుర్తించి తమ దృష్టికి తీసుకురావడానికి చొరవ చూపాలని మున్సిపల్ కమిషనర్ వార్డు అధికారులకు, జవాన్లకు అప్రమత్తంగా చేశారు. ప్రతీనెల వార్డు అధికారులు, కోర్‌కమిటీలతో మున్సిపల్ కమిషనర్, ఎమ్మెల్యే సమీక్ష నిర్వహిస్తారు. సమస్య తీవ్రతరం ఉంటే అక్కడికి స్వయంగా కమిషనర్ లేదా సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలి. వార్డుల వారీగా వార్డు అధికారి, జవాన్లు ఫోన్ నంబర్లతో బోర్డులను కూడా ఏర్పాటుచేసి ప్రజలు నేరుగా వారికి సమస్యలు చెప్పేందుకు అవకాశం కల్పిస్తున్నారు.

'రైతు నేస్తం'ను సద్వినియోగం చేసుకోవాలి

-జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం



పత్తి మిల్లులో రైతులతో మాట్లాడుతన్న రాజారత్నం

కొడంగల్ రూరల్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి మంగళవారం రైతు వేదికల్లో నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రాజారత్న సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రావులపల్లి రైతు వేదికలో రైతులతో కలిసి ఆయన రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. వరివిత్తనాల పంపిణీని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ ప్రారంభించగా ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అలాగే పత్తి పంటల కోతల అనంతరం అవశేషాల నిర్మూలనకు తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం నీటూర్ గేట్ దగ్గర ఉన్న విజయ పత్తి మిల్లును సందర్శించి రైతులతో మాట్లాడారు. స్లాట్ బుక్ చేసుకోకుండా మిల్లుకు వెళ్తే పత్తి కొనుగోలు చేయరని వివరించారు. కావున పత్తి వేసిన రైతులు ఫోన్ నంబర్ అప్డేషన్ కోసం వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గరకి వెళ్లి చేయించుకోవాలన్నరు. కార్యక్రమంలో కొడంగల్ సహాయ వ్యవసాయ సంచాలకులు శంకర్ రాథోడ్, ఏఎంసీ చైర్మన్ అంబయ్య గౌడ్, ఎంఏఓ శ్రీలత, పీఏసీఎస్ చైర్మన్ వివకుమార్ గుప్తా, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి ట్రెసా కృషి

- ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్
- ట్రెసా జిల్లా అధ్యక్షుడిగా డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ ఎన్నిక



ట్రెసా జిల్లా కార్యవర్గం



విజయేందర్

వికారాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.గౌతమ్ కుమారు అన్నారు. వికారాబాద్ కలెక్టరేట్‌లో మంగళవారం ట్రెస్మా జిల్లా సమావేశం నిర్వహించి 22మందితో కూడిన జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పరిగి డిప్యూటీ తహసీల్దార్ గడ్డమీది విజయేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజేందర్ మూడు పర్యాయాలుగా జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ వికారాబాద్, ధారూర్ నాయబ్ తహసీల్దార్‌గా పనిచేశారు. నూతన జిల్లా కార్యదర్శిగా మునీరొద్దీన్‌తో సహా 22మందితో కూడిన కార్యవర్గాన్ని జిల్లా రెవెన్యూ ఉద్యోగులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్ మాట్లాడుతూ.. రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి బాధ్యతగా పనిచేయాలని సూచించారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ట్రెసా పనిచేస్తోందని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్తూ పరిష్కారానికి ట్రెసా కృషి చేస్తోందని తెలిపారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర సమన్వయకర్త ఎం.నారాయణరెడ్డి, ఎన్నికల పరిశీలకులుగా కె.నిరంజన్‌రావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ట్రెసా కార్యదర్శి మనోహర్ చక్రవర్తి, మాజీ అధ్యక్షుడు పి.కృష్ణయ్య, స్థానిక తహసీల్దార్ లక్ష్మీనారాయణ, జిల్లా తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్

పంచాయతీ ఎన్నికల్లో 'కాంగ్రెస్' అభ్యర్థులకు పట్టం కట్టాలి

కడ్తాల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలందరూ కాంగ్రెస్ మద్దతు అభ్యర్థులకు పట్టం కట్టి ప్రగతికి బాటలు వేయాలని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాజకీయ ఉనికి కోసం విపక్షాలు సాగిస్తున్న కుట్ర రాజకీయాలను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు విజయ సోపానమన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పనకు ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే ఆమోదించకుండా బీజేపీ ప్రభుత్వం మోకాలు ఒడ్డిందని ఆరోపించారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, జగన్ తదితరులు ఉన్నారు.



పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పోలీసులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ

నేరాల నియంత్రణపై దృష్టిపెట్టండి

- కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి
- తాండూరు డీఎస్పీ నర్సింగ్‌యాదయ్య

పెద్దేముల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణపై ప్రత్యేకదృష్టి పెట్టాలని తాండూరు డీఎస్పీ నర్సింగ్‌యాదయ్య అన్నారు. రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డితో కలిసి పెద్దేముల్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌లోని పలు విభాగాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీచేశారు. అనంతరం స్టేషన్‌సిబ్బందితో సమావేశమై పెండింగ్ కేసులు ఉంటే వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. నేరాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. సైబర్‌నేరాలకు ప్రజలు గురికాకుండా వారికి తగిన అవగాహన కల్పించాలని చెప్పారు. రాత్రివేళ పహారా, మహిళాభద్రత, యువతలో నేరాల నియంత్రణ, సైబర్ భద్రతపై దృష్టిపెట్టాలని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్‌సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఎస్ఐ శంకర్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలి



పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏలు

పరిగి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏలకు వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. వీఆర్‌ఏల అక్రమ అరెస్టులను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 61 ఏళ్ల పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. వీఆర్‌ఏలు తలపెట్టిన చలో హైదరాబాద్ నిరసనను అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. గతంలో వారసత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు కల్పించాలని, లేనిచో ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి సంగమేశ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి రవిసాగర్, రంగారెడ్డి జిల్లా భరత్‌యాదవ్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు రమేశ్, పెద్ద జిల్లా అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



కడ్తాల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిచేడ్ జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్, మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

అక్రమంగా షెడ్డు నిర్మాణం .. కూల్చివేత



షెడ్డును కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

ఘట్‌కేసర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడ వెంకటాద్రి టౌన్‌షిప్‌లో అక్రమంగా నిర్మించిన షెడ్డును మంగళవారం హైడ్రా అధికారులు కూల్చివేశారు. చౌదరిగూడలోని సర్వేనెంబర్ 867లోని ప్రభుత్వ భూమిలో గతంలో అక్రమ లేఅవుట్ చేశారు. ఇళ్లమధ్యన, మెయిన్‌రోడ్డులో ఉండటంతో స్థానికులు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఇక్కడ గజంస్థలం 50వేలకు పైగా ధర పలుకుతుంది. మొదట్లో అధికారులు ఇది ప్రభుత్వ స్థలమని అనుమతులు ఇవ్వలేదు. కాలక్రమేనా అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై అనుమతులు ఇవ్వడం ప్రారంభించారు. అనంతరం ఎల్‌ఆర్‌ఎస్ పథకం అందుబాటులోకి రావడంతో పలువురు తమ ప్లాట్లను ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులు సైతం పొందారు. దీంతో పెద్దఎత్తున బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. తాజాగా ఈశ్వర్ అనే వ్యక్తి మెయిన్‌రోడ్డుకు 800 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు షెడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో కాలనీవాసులు ఇది ప్రభుత్వస్థలమని హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగి షెడ్డును కూల్చివేశారు.



తన పత్రాలను చూపుతున్న బాధితుడు ఈశ్వర్

డాక్యుమెంట్, ఎల్‌ఆర్‌ఎస్, ఇంటి నంబరు ఉన్నాయి

నేను ఈస్థలంను మాజీ ఎమ్మెల్యే రెగా కాంతారావు వద్ద కొనుగోలు చేశాను. అప్పటికే ఇక్కడఇల్లు ఉండటంతో పాటు దానికి ఇంటి నంబర్, గ్రామపంచాయితీ ట్యాక్సు సైతం చెల్లిస్తున్నట్లు వివరించారు. నాకు స్థలాన్ని ఇప్పించిన వారే ఇది ప్రభుత్వ స్థలమని ఫిర్యాదు చేశారు. ఇదే లేఅవుట్‌లో నాలుగైదు అంతస్తులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మించుకున్నారు. నావద్దకు వచ్చేసరికి ఇది ప్రభుత్వ స్థలమని కూల్చివేయడం సరికాదు. నావద్ద రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌తో పాటు ఎల్‌ఆర్‌ఎస్, ఇంటి నంబర్ ఉన్నాయి. ఇది ప్రభుత్వ స్థలమైతే అన్ని నిర్మాణాలను కూల్చివేయాలి.

- ముద్దం ఈశ్వర్, బాధితుడు

బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలి


పరిగిలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పరిగి,నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బూటకపు ఎన్‌కౌంటర్లను వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య డిమాండ్ చేశారు. పరిగిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ, గిరిజనుల నివాస అటవీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి మావోయిస్టులు అడ్డుగా ఉన్నారనే, వారిని మట్టుపెడుతున్నారని ఆరోపించారు. మావోయిస్టులపై కేంద్రప్రభుత్వం దుశ్చర్యలకుపాల్పడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు ఎండీ హబీబ్, సత్తయ్య, రఘురాం, మహబూబ్, రాంచంద్రయ్య, బాలరాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

ధారాసింగ్‌కు సన్మానం

తాండూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన ధారాసింగ్‌నాయక్‌ను మంగళవారం తాండూరు పట్టణం సీతారాంపేట్ ఆంజనేయస్వామి దేవాలయ చైర్మన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు భీమలింగం సన్మానించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.


జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ధారాసింగ్‌ను సన్మానిస్తున్న భీమలింగం

వడ్ల పైసలు వస్తలేవ్!

- నెలరోజులైనా ఖాతాల్లో జమకాని వైనం
- టెక్నికల్ సమస్య అంటున్న అధికారులు
- ఇబ్బందులు పడుతున్నరైతులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ మారడంతో ధాన్యం డబ్బులు రాక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం సేకరించిన వెంటనే, బిల్లులు చేసి 24గంటల్లో రైతుల బ్యాంక్‌ఖాతాలో డబ్బులు జమచేయాలి. కానీ ఘట్‌కేసర్ మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరించి నెలరోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఏఒక్క రైతు బ్యాంక్‌ఖాతాలో డబ్బులు జమకాలేదు. గత సీజన్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ఉండేది. బిల్లులు వెంటనే చేసి రైతుల ఖాతాలో డబ్బులు జమ చేసేవారు. ఈ సీజన్‌లో నిర్వాహణ అంతా రైతుసేవా సహకార సంఘం ఘట్‌కేసర్ చేపట్టింది. ఎదులాబాద్, మాదారం, అంకుశాపూర్, అవుశాపూర్, ప్రతాప్‌సింగారంల్లో ఘట్‌కేసర్ రైతుసేవా సహకారసంఘం ఆధ్వర్యంలో గత నెల 16వ తేదీన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యం తరలించి నెల రోజులు గడుస్తున్నప్పటికీ బిల్లులు చేయడంలో సహకార సంఘం అధికారులు మాత్రం వెనుకపడ్డారు. దీంతో రైతులు ధాన్యం డబ్బులు రాక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎదులాబాద్‌లో 190 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయగా 135 మంది బిల్లులను ట్యాబ్‌లో నమోదు చేశారు. మాదారంలో 100 మంది రైతుల నుంచి కొనుగోలు చేయగా 30 బిల్లులు, అంకుశాపూర్‌లో 40 మందికి 13 బిల్లులు, అవుశాపూర్‌లో 23 మంది బిల్లులకు 10, ప్రతాప్‌సింగారంలో 19మందికి గాను 6మంది బిల్లులను ట్యాబ్‌లో నమోదు చేసి జిల్లా అధికారులకు పంపించారు. వడ్ల బిల్లులు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి ధాన్యం బిల్లులు వెంటనే వచ్చే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.


మాదారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో బస్తాలను తూకం వేస్తున్న హమాలీలు

ఈనెల 4న ధాన్యాన్ని సేకరించారు



మూడెకరాల్లో వరిసాగు చేయగా వచ్చిన ధాన్యంలో 146బస్తాల వడ్లను ఎదులాబాద్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించా. ఈనెల 4వ తేదీన ధాన్యం లోడ్‌వెళ్లినా ఇంతవరకు డబ్బులు బ్యాంక్‌లో జమకాలేదు. అధికారులు ట్యాబ్ ఎంట్రీ ఆలస్యమైందని చెబుతున్నారు. ప్రతీసారి వడ్లు తీసుకున్న వెంటనే రెండు మూడురోజుల్లో బ్యాంక్ ఖాతాలో జమయ్యేవి. డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియడంలేదు.

\- మాయ వెంకటేష్, రైతు మర్రిపల్లిగూడ

డబ్బుల కోసం ఎదురుచూస్తున్నా



నాకు పండిన 206 బస్తాల ధాన్యం తరలించి 25రోజులు అవుతుంది. ఇప్పటి వరకు డబ్బులు రాలేదు. డబ్బుల కోసం ఎదురుచూస్తున్నాం. యాసంగి సీజన్ దగ్గరపడుతోంది. ధాన్యం డబ్బులు త్వరగా వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- ఎల్సాని అయిలయ్య యాదవ్, రైతు అవుశాపూర్

రేపటి నుంచి బ్యాంక్ ఖాతాలోకి డబ్బులు



ధాన్యం బిల్లింగ్ విషయంలో టెక్నికల్‌గా కొద్దిగా సమస్య ఉండేది. సమస్యను పరిష్కారించాం. ధాన్యం సేకరించి బిల్లు అయినా రైతుల బ్యాంక్‌ఖాతాలో రేపటి నుంచి డబ్బులు పడుతాయి. డబ్బుల విషయం కాబట్టి ప్రతీది క్షుణ్ణంగా చెక్ చేసి డబ్బులు వేయాల్సి ఉంటుంది. రైతులు ఇబ్బంది పడొద్దు. బిల్లు అయినా అందరి బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ అవుతాయి.

\- సుగుణబాయి, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొడంగల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కొడంగల్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుద్యాల్ మండలంలోని చిలుముల్‌మైలారం గ్రామానికి చెందిన హన్మయ్య(35) మంగళవారం కొడంగల్ మున్సిపల్ కార్యాలయం నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ వెనక టైర్ల కింద పడి హన్మయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక మృత్యువాత

ధారూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మేక మృత్యువాతపడిన ఘటన మండలంలోని ధారూరు స్టేషన్ శివారులోని మెథడిస్టు జాతర ప్రాంగణం సమీపంలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. దోర్నాల్ తండాకు చెందిన రైతు రతన్ మేకలు మేపడానికి ధారూరు స్టేషన్ శివారులోని వంతెన వద్దకు వెళ్లాడు. మెథడిస్టు జాతర కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లిన మేకకు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మేక విలువ రూ.15వేలు ఉంటుందని, బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని అదే తండాకు చెందిన బీజేపీ మండలాధ్యక్షుడు రాజునాయక్ కోరారు.

పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు


చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతికి ప్రజాప్రభుత్వం కాంగ్రెస్ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల సురేశ్‌యాదవ్, సీనియర్ నాయకులు గూడెం రాములు యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయంలో మంగళవారం రూ.46 లక్షల 51,336 విలువ గల కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, 9మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను తహసీల్దార్ పురుషోత్తంతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫసీయోద్దీన్, మల్లేశ్ యాదవ్, కృష్ణారెడ్డి, కలిమోద్దీన్, రవీందర్, రామేశ్వర్, జగదీశ్వర్, సర్వేశ్, సలీం, సంజీవరెడ్డి, వడ్ల వెంకటేశం, అబ్రహం, అశోక్, వైద్యనాథ్, పాండునాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు

పెద్దేముల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక గుర్తింపునిస్తుందని నాయకులు మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని నర్సాపూర్, రుద్రారం గ్రామాల్లో మంగళవారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశం, వీరేశం పాల్గొన్నారు.


పరిగి: రంగాపూర్‌లో మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి

పరిగి: రంగాపూర్, యాభాజీగూడ, తొండపల్లి గ్రామాల్లో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి మంగళవారం ఇందిరా శక్తి చీరలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ రాజు, తావుర్యానాయక్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: మండలంలో 26 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, మహిళాసంఘం సభ్యులు ప్రభుత్వం నుంచి వచ్చిన ఇందిరమ్మ చీరలను మంగళవారం అందజేశారు.

దౌల్తాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఇందిరా మహిళాశక్తి ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బోడి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

దుద్యాల్: మండల కేంద్రంతో పాటు పోలెపల్లి, ఈర్లపల్లి, చిలుముల్‌మైలారం, ఆలేడ్ తదితర గ్రామాల్లో మంగళవారం మహిళలకు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు.

దౌల్తాబాద్: మండలంలోని 18మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం తహసీల్దార్ గాయత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బోడి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: చాపలగూడెంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్యతో కలిసి డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శి గోపాల్‌నాయక్, కుమ్మరి స్వామి, వెంకటయ్యగౌడ్, అంబాజీ రావు, మహిళలు పాల్గొన్నారు.

పూడూరు: తుర్కఎన్కెపల్లిలో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. మంగళవారం గ్రామంలో జరిగిన చీరల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్ పాల్గొని మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్యలో మహిళలకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్ ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

తాండూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలకు ఉపాధ్యాయులు సమయానికి చేరుకోవడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఓగిపూర్, మల్కాపూర్, కోటబాస్పల్లి, నారాయణపూర్, గుండ్లమడుగుతండా, సంగెం కలాన్, చింతామణిపట్నం ,తదితర పాఠశాలలకు ఉపాధ్యాయులు ప్రతీరోజు ఆలస్యంగా వస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సోమవారం ఆయా పాఠశాలలో కొంత మంది ఉపాధ్యాయులు ఆలస్యంగా చేరుకున్నారు. వీరంతా వికారాబాద్, హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో బస్సులు, రైళ్ల వల్ల సమయానికి పాఠశాలకు చేరుకోవడం లేదని తెలుస్తోంది. పాఠశాలను తనిఖీ చేయాల్సిన విద్యా శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించక పోవడంతో ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై మండల విద్యాధికారి వెంకటయ్యను వివరణ కోరగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ


పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు

దుద్యాల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దుద్యాల్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి మంగళవారం ఇంచార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ భూమి పూజ నిర్వహించారు. రూ.70లక్షలు కడా నిధులతో భవన నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాజ, నాయకులు శ్రీశైలం గౌడ్, ఖలీల్‌పాష, హనుమంతు పాల్గొన్నారు.

బీసీ జేఏసీ మండల చైర్మన్‌గా గోవర్ధన్



దోమ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీసీ జేఏసీ దోమ మండల నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మేకల గోవర్ధన్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. జేఏసీ వైస్‌చైర్మన్‌గా నరసింహయాదవ్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్ గౌడ్, కార్యదర్శిగా మహేశ్‌కుమార్, సలహాదారులుగా డాక్టర్ జగన్‌మోహన్, రామకృష్ణ, ధనేశ్వర్, కేశవులు, మాజీ సర్పంచ్ కేశవులు, కొండాయపల్లి చందు, మోత్కూర్ గోపాల్, శాంతికుమార్, శ్రీశైలం, లక్ష్మయ్య, బంగ్లా యాదయ్య, గోవర్ధన్, జంగయ్య, ప్రచార కార్యదర్శిగా జోగు వెంకటయ్యను ఎన్నుకున్నారు.

సీఎంకు జిల్లాపై ప్రేమ లేదు


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్

వికారాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి వికారాబాద్ జిల్లాపై ప్రేమలేదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ భవనంలో మంగళవారం స్థానిక నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా వికారాబాద్ వచ్చిన రేవంత్‌రెడ్డి వికారాబాద్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఇప్పుడు పూర్తిగా విస్మరిస్తున్నాడన్నారు. డిగ్రీ, మెడికల్ కళాశాలలు బీఆర్ఎస్ హయాంలో వచ్చినవేనని ఇప్పుడు వికారాబాద్‌లో ఏ ఒక్క కొత్త ప్రాజెక్టు ముందుకు రావడం లేదన్నారు. జిల్లా వ్యక్తి సీఎం అవుతాడని నాలుగునియోజకవర్గాలు తోడుఉంటే ఇప్పుడు మూడు నియోజకవర్గాల అభివృద్ధిని గాలికి వదిలేశాడని విమర్శించారు. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన వికారాబాద్ జిల్లాపై సవతి ప్రేమ చూపిస్తూ మహబూబ్‌నగర్ వైపు చూస్తున్నారన్నారు. స్థానిక స్పీకర్ సైతం అభివృద్ధి గురించి ఆలోచించి దృష్టి పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో సొంత పార్టీ నాయకులే కాంగ్రెస్‌ను ఇప్పుడు తిట్టుకునే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్ రెడ్డి, దేవదాసు, సుభాన్ రెడ్డి, గయాజ్, మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రతీ పాఠశాలలో రాజ్యాంగాన్ని చదివించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

వికారాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని ప్రతీ పాఠశాలలో చదివించే విధంగా చూడాలని దళితసంఘాల నాయకులు కోరారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కులకచర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య అన్నారు. చాపలగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డితో కలిసి విద్యార్థులతో భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెనూ పాటించాలి

కులకచర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో డైట్ మెనూను తప్పనిసరిగా పాటించాలని వైద్యాధికారి కిరణ్ కుమార్‌గౌడ్ అన్నారు. రాంపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. వసతి గృహాల్లో ప్రభుత్వం నిర్దేశించిన డైట్ మెనూప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటయ్య, వార్డెన్ సవిత, సిబ్బంది పాల్గొన్నారు.


గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలలో భోజనం పరిశీలిస్తున్న వైద్యాధికారి కిరణ్‌కుమార్

సమరమే..!

(ఐదో పేజీ తరువాయి)

పోలింగ్ జరగనుంది. అదేరోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

రెండో విడత డిసెంబరు 2నుంచి నామినేషన్లు

రెండో విడత ఎన్నికలకు సంబంధించి ఈనెల 30న నోటిఫికేషన్ విడుదల చేసి ఆ రోజు నుంచి డిసెంబరు 2వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 3న నామినేషన్లు పరిశీలించి అర్హులైన అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. అభ్యంతరాలను 4వ తేదీన సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించనున్నారు. వచ్చిన అభ్యంతరాలపై విచారణ నిర్వహించి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా పరిష్కరిస్తారు. 6వ తేదీ, సాయంత్రం 3 గంటల్లోగా నామినేషన్లు ఉప సంహరించుకునేందుకు అవకాశం ఇచ్చారు. అదేరోజు సాయంత్రం పోటీలో ఉండే అభ్యర్థులు, వారికి కేటాయించిన గుర్తులను ప్రకటిస్తారు. 14వ తేదీన ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల పోలింగ్ నిర్వహించి అదేరోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

మూడో విడత డిసెంబర్ 5 నుంచి..

మూడో విడత ఎన్నికలకు సంబంధించి డిసెంబరు 3న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అదే రోజు నుంచి 5వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 6న నామినేషన్ల పరిశీలన కొనసాగనుంది. అదేరోజు అర్హులైన అభ్యర్థుల జాబితా ప్రకటించనున్నారు. అభ్యంతరాలు ఉంటే 7వ తేదీలోగా తెలియజేస్తే 8వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పరిష్కరిస్తారు. 9వ తేదీ, సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అదేరోజు సాయంత్రం పోటీలో ఉండే అభ్యర్థులు, వారికి కేటాయించిన గుర్తులను ప్రకటిస్తారు. 17వ తేదీన ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదేరోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు.

విడతల వారీగా పంచాయతీలు..

మొదటి విడతలో తాండూరు డివిజన్‌లో కొడంగల్, తాండూరు నియోజకవర్గాల పరిధిలోని 262 పంచాయతీలు, 2,198 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. తాండూరు మండలంలో 33 పంచాయతీలు, 290 వార్డులు, బషీరాబాద్ మండలంలో 39 పంచాయతీలు, 312 వార్డులు, యాలాల్.. 39 పంచాయతీలు, 318 వార్డులు, పెద్దేముల్.. 38 పంచాయతీలు, 308 వార్డులు, కొడంగల్.. 25 పంచాయతీలు, 222 వార్డులు, దౌల్తాబాద్.. 33 పంచాయతీలు, 290 వార్డులు, బొంరాస్‌పేట్.. 35 పంచాయతీలు, 292 వార్డులు, దుద్యాల్.. 20 పంచాయతీలు, 166 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు.

రెండో విడతలో 175 పంచాయతీలు

రెండో విడతలో వికారాబాద్ డివిజన్ పరిధిలో 175 పంచాయతీలు, 1,520 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వికారాబాద్ మండలంలో 21 పంచాయతీలు, 182 వార్డులు, ధారూరు మండలంలో 34 పంచాయతీలు 286 వార్డులు, మోమిన్‌పేట్ మండలంలో 29 పంచాయతీలు, 256 వార్డులు, చేవెళ్ల నియోజకవర్గంలోని నవాబుపేట్ మండలంలో 32 పంచాయతీలు, 276 వార్డులు, బంట్వారం మండలంలో 12 పంచాయతీలు, 106 వార్డులు, మర్పల్లి మండలంలో 29 పంచాయతీలు, 264 వార్డులు, కోట్‌పల్లి మండలంలో 18 పంచాయతీలు, 150 వార్డుల్లో ఎన్నికలు జరగనున్నాయి.

మూడో విడతలో 157 గ్రామాలు

చివరి విడతలో పరిగి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 157 పంచాయతీలు, 1,340 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. పరిగి మండలంలో 32 పంచాయతీలు, 258 వార్డులు, పూడూరు.. 32 పంచాయతీలు, 282 వార్డులు, కులకచర్ల మండలం..33 పంచాయతీలు, 280 వార్డులు, చౌడాపూర్.. 24 పంచాయతీలు, 202 వార్డులు, దోమ.. 36 పంచాయతీలు, 308 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. మూడు విడతల ఎన్నికలు పూర్తయ్యే వరకు ఈ నియమావళి జిల్లా వ్యాప్తంగా అమల్లో ఉంటుంది.

సంక్షిప్తంగా..

కొనుగోలు కేంద్రం ప్రారంభం

యాలాల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవాలని తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముద్దాయిపేట్, ముకుందాపూర్ గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ జక్కేపల్లి మొగులప్ప, ముద్దాయిపేట్ మాజీ సర్పంచ్ బిచ్చప్ప, ఐకేపీ సభ్యులు పాల్గొన్నారు.

ధూమపానం వదిలేయాలి

శామీర్‌పేట: ధూమపానం వదిలేయాలని మెడిసిటీ స్పెషలిస్ట్ వైద్యురాలు కమ్మపాటి శైలజా, పల్మనరి మెడిసన్ స్పెషలిస్ట్ డాక్టర్ రాఖేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. అలియాబాద్‌లో మంగళవారం ఘన్‌పూర్ మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెడికల్ విద్యార్థులు ధూమపానం వలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలియాబాద్‌లోని బృందారెడ్డి కన్వెన్షన్ హాల్‌వద్ద నుంచి మెడిసిటీ మెడికల్ విద్యార్థుల ర్యాలీ మున్సిపల్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో మెడిసిటీ ఆస్పత్రికి చెందిన పలువురు స్పెషలిస్టు డాక్టర్లు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ నూతన కార్యవర్గం

మర్పల్లి: మండల కేంద్రంలోని హనుమాన్ మందిర్ కమిటీ అధ్యక్షుడిగా రంగారెడ్డిని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా వీరేశం, రాకేశ్, గంగమ్మ, తిరుపతి ఎన్నికయ్యారు. అర్చకులు కైలాసం, నాయకులు రాముయాదవ్, సురేశ్‌యాదవ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మల్లేశ్ యాదవ్, నాయకులు నర్సింగ్ యాదవ్, సుధాకర్ పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు ఆర్థిక సాయం

తాండూర్ రూరల్: యాలాల మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన బందెప్ప, భార్య లక్ష్మి ఇటీవల చేవెళ్ల సమీపంలోని మీర్జాగూడ వద్ద జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో మృతిచెందిన విషయం విధితమే. దీంతో వారి ఇద్దరు కూతుళ్లు అనాథలుగా మారారగా బాధిత కుటుంబానికి గోనూర్ గ్రామానికి చెందిన కట్టెల శ్రీనివాస్, శివలీల దంపతులు మంగళవారం గ్రామానికి చేరుకొని రూ.12వేలు ఆర్థిక సాయం చేశారు.

ప్రయోగాలతో బోధన సులభతరం

పరిగి: ప్రయోగాలతో బోధన సులభతరమని ఎంఈవో గోపాల్ అన్నారు. పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నంబర్ 1 పాఠశాలలో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీ రాందాస్, ఆర్‌పీలు వాసు, నర్సింహా, రాజు పాల్గొన్నారు.

రేపు తాండూరులో ఉచిత కంటి వైద్య శిబిరం

తాండూరు: ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా గురువారం(రేపు) ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తాండూరు పట్టణం 11వ వార్డు సాయిపూర్‌లోని వీరనాగమ్మ దేవాలయం వద్ద ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు కొర్విచెడ్ మల్లికార్జునస్వామి జాతర

బషీరాబాద్: కొర్విచెడ్ సమీపంలో గల శ్రీ మల్లికార్జునస్వామి(మల్లన్న) ఆలయం జాతరకు ఉత్సవాలకు ముస్తాబైంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు అన్ని చర్యలు చేపట్టారు. నేడు(బుధవారం) ఉదయం 11గంటలకు కొర్విచెడ్ గ్రామం నుంచి ఆలయానికి భక్తులు బోనాలతో వెళ్లి స్వామి వారికి నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం గ్రామం నుంచి మధ్యాహ్నం 3గంటలకు శ్రీమల్లికార్జునస్వామి విగ్రహంతో పల్లకీసేవ నిర్వహిస్తారు. ఆతర్వాత జాతర ఉత్సవాలు జరుగుతాయి.ఈ ఉత్సవాల్లో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ఐ నుమాన్‌అలీ తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి

ఘట్‌కేసర్: అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చర్లపల్లి అగ్నిమాపక కేంద్రం అధికారి చంద్రశేఖర్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం అగ్ని ప్రమాదాలపై ప్రత్యేకడ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సునీల్ కేతిరెడ్డి, సీహెచ్ శ్రీశైలం, శ్రీనివాస్, మురుగేష్ కుమార్, హెచ్ఎం పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ పద్ధతిలో శిక్షణ

పూడూరు: చిన్నతరహా నీటివనరులను ఎలాంటి పేపర్ ఉపయోగించకుండా డిజిటల్ పద్ధతిన గణన నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ అధ్యక్షతన గణన నిర్వహణపై జీపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర జలవనరుల శాఖ ఆధ్వర్యంలో ఐదేళ్లకోసారి చిన్నతరహా నీటివనరుల గణన నిర్వహిస్తుందని తెలిపారు. 2వేల హెక్టార్లలోపు ఆయకట్టు ఉన్న వనరుల గణన చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న గౌడ సంఘం నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ప్రతాప్‌సింగారం గౌడ సంఘం నాయకులు మంగళవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ప్రతాప్‌సింగారం రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 326లో మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇటీవల వాసుదేవరెడ్డి మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేయడంతో పాటు గ్రామానికి వచ్చే పాతరోడ్డును కలిపి ఫెన్సింగ్ వేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాతరోడ్డు పక్కన ఉన్న తాగునీటి పైప్‌లైను వాడుకుంటూ ప్రజలకు తాగునీరు రాకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. కంఠమహేశ్వరస్వామి ఆలయం ముందున్న భూమిని సైతం కబ్జా చేయాలని యత్నిస్తున్నాడని తెలిపారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వ్యక్తి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దారును కోరారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం అధ్యక్షుడు సత్తయ్యగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, కుమార్ ఉన్నారు.

కులకచర్ల: ప్రభుత్వ భూమిని ఆక్రమించి కాలనీ రోడ్డుకు అడ్డంగా ఫెన్సింగ్ వేసి గోడ నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ బీసీ కాలనీవాసులు కోరారు. గ్రామానికి చెందిన ఓవ్యక్తి 1989లో టీడీపీ హయంలో తనకున్న సర్వే నంబర్ 543లో రెండెకరాల 7గుంటలు ప్రభుత్వానికి ఇళ్లనిర్మాణం కోసం విక్రయించాడు. ప్రభుత్వం గ్రామంలో ఇళ్లులేని వారికి పట్టాలు ఇవ్వగా దాదాపు 150 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. మరింత ప్రభుత్వ ఖాళీస్థలం కాలనీ పక్కనే ఉంది. ఇట్టి ప్రభుత్వ భూమి పక్కన గ్రామానికి చెందిన వారి భూములున్నాయి. ఆఖాళీ స్థలం తమకు చెందుతుందని కాలనీకి అడ్డంగా ఫెన్సింగ్ వేసి గోడ నిర్మించాడు. కాలనీ నీళ్ల, పంచాయతీ బోరు నీరు బయటకు వెళ్లకుండా మరో చోట అడ్డంగా గోడ నిర్మించాడు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని పలుమార్లు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ స్పందించి సర్వే కోసం రెండు నోటీసులు పంపించినా సదరు భూయజమానులు తీసుకోలేదు. ఇప్పటికైనా విచారణ జరిపించి న్యాయం చేయాలని బీసీ కాలనీవాసులు కోరుతున్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

కులకచర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని సీఆర్‌పీ గంగ్యానాయక్ అన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారం మంగళవారం గోప్యనాయక్ తండాలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్నతో కలిసి సర్వే నిర్వహించారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని, చదువుతోనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని తెలిపారు.


గోప్యనాయక్ తండాలో సర్వేచేస్తున్న సీఆర్‌పీ గంగ్యానాయక్